ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 14-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పురోగమిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- ❖ దేశ సమగ్రతను కాపాడటం, త్యాగాల ద్వారా సాధించిన స్వేచ్ఛను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ అన్నారు.

- ❖ దేశ నిర్మాణంలో నారీశక్తిని సమర్థవంతంగా వినియోగించుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

- ❖ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాలకు చెందిన 1,057 మందికి శౌర్య, సేవా పతకాలను ప్రకటించింది.

========================

భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా పురోగమిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి కొద్దిసేపటి క్రితం జాతినుద్దేశించి మాట్లాడుతూ... భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు.. ప్రపంచ సగటు వృద్ధి రేటుకు రెట్టింపు కంటే ఎక్కువగా ఉంటుందన్నారు. దేశ ఆర్థిక పురోగతి, జాతీయ భద్రత పునాదులను ఆత్మనిర్భర్ భారత్ అభియాన్.. మరింత బలోపేతం చేసిందని చెప్పారు. `సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు-2030` లో కొన్నింటిని భారత్.. నిర్దేశిత గడువు కంటే ముందే సాధించిందన్నారు. జాతీయ ప్రయోజనమే భారత విదేశాంగ విధానానికి పునాది అని, శాంతి, సహకారం, చర్చలు, వసుధైవ కుటుంబకం అనేవి ఆ విధానానికి మూలస్తంభాలని వివరించారు. ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు పరస్పర సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్ అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుందని చెప్పారు. 2047లో స్వాతంత్ర్య శత

వార్షికోత్సవం నాటికి మనదేశం "వికసిత్ భారత్" దిశగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. అలాగే తెలుగు కవి గురజాడ అప్పారావు రాసిన కవితను రాష్ట్రపతి తన ప్రసంగంలో ఉటంకించారు.

(వాయిస్ 30 సెకెన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశం నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛ.. గత తరాల వారి త్యాగాల వల్ల లభించిందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `విభాజన విభీషక స్మృతి దివస్` కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. దేశ సమగ్రతను కాపాడటం, ఆ త్యాగాల ద్వారా సాధించిన స్వేచ్ఛను గౌరవించడం ప్రతి ఒక్కరి ప్రధాన కర్తవ్యమని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. దేశ విభజన అనేక మంది జీవితాలను ఛిన్నా భిన్నం చేసిందని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. విభజనతో అనేక మంది నిరాశ్రయులయ్యాయని, ప్రియమైన వారిని కోల్పోయారని, అపారమైన బాధను అనుభవించారని వివరించారు. దేశ విభజన సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారికి, ఆనాటి అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వారికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లు నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పోలీస్, అగ్నిమాపక సేవలు, హోం గార్డ్, పౌర రక్షణ సేవలకు చెందిన ఒక వెయ్యి 57 మందికి కేంద్ర ప్రభుత్వం 2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శౌర్య, సేవా పతకాలను ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈరోజు 301 శౌర్య పతకాల జాబితాను విడుదల చేసింది. ప్రాణాలను, ఆస్తులను కాపాడటంలో, నేరాలను నివారించడంలో లేదా నేరస్థులను పట్టుకోవడంలో ప్రదర్శించిన విశేషమైన ప్రదర్శనకు శౌర్య పతకాన్ని ప్రదానం చేస్తారు. ఇందులో 272 పోలీస్ సిబ్బందికి, 29 అగ్నిమాపక సేవా సిబ్బందికి కేటాయించారు. మొత్తం 301 శౌర్య పతకాలలో, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల నుండి 197 మంది, జమ్మూ కాశ్మీర్ నుండి 51 మంది, ఈశాన్య ప్రాంతం నుండి 12 మంది, ఇతర ప్రాంతాల నుండి 41 మంది సిబ్బందికి అందజేస్తున్నారు. అలాగే 92 విశిష్ట సేవా పతకాలను, 664 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ను ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విమానయానం వంటి ఆకాంక్షిత రంగాలకు ఇటీవలి పార్లమెంటు సమావేశాల్లో అవసరమైనంత సమయం లభించలేదని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. దీనికి కారణం ప్రతిపక్షాల అంతరాయాల మధ్య వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడడమే అని ఆయన సమాజిక మాధ్యమం పోస్టులో తెలిపారు. పౌర విమానయాన రంగానికి సంబంధించిన 28 ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి తాను ఎదురుచూస్తున్నానని చెప్పారు. 2013 సంవత్సరం వర్షాకాల సమావేశాల్లో తీసుకున్న 14 ప్రశ్నలతో పోలిస్తే.. ఈ సంఖ్య దాదాపు రెట్టింపు అయిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం రక్షణ దళాల ఆధునీకరణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి ద్వారా ఆయన సైనికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ఆత్మనిర్భర్ భారత్, మేక్-ఇన్-ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా గత 12 ఏళ్లలో రక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. దేశీయ రక్షణ ఉత్పత్తి గత దశాబ్ద కాలంగా నాలుగు రెట్లు పెరిగిందని, భారత్.. ప్రపంచ రక్షణ తయారీ కేంద్రంగాను, రక్షణ ఎగుమతిదారుగా అభివృద్ధి చెందుతోందన్నారు. రక్షణ

దళాలలో మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించడంపైనా, దేశ నిర్మాణంలో నారీశక్తిని సమర్ధవంతంగా వినియోగించుకోవడంపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకెన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

సద్భావన, పరస్పర గౌరవం, విశ్వాసం భారత్ - వియత్నాంల మధ్య సంబంధాలకు బలమైన పునాది అని వియత్నాంలోని భారత రాయబారి షెరింగ్ డబ్ల్యూ షెర్పా అన్నారు. భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో ఆయన ఈ విషయాన్ని ఒక వియత్నామీస్ ఆంగ్ల దినపత్రికలో రాశారు. ఈ సాంప్రదాయం ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి కీలకంగా నిలుస్తుందన్నారు. ఉమ్మడి నాగరికతా సంబంధాలు, బౌద్ధమతం, చరిత్ర, సంస్కృతిలో పాతుకుపోయిన భారత్-వియత్నాం సంబంధాల పరిణామం అసాధారణమైనదిగా అభివర్ణించారు. వసుధైవ కుటుంబం అనే స్ఫూర్తితో అభివృద్ధికి భారతదేశం అనుసరిస్తున్న ప్రజల కేంద్రీకృత విధానం... ప్రపంచ శ్రేయస్సుకు దోహదపడాలనే దాని నిబద్ధత గొప్పవని షెర్పా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

2027 జనాభా గణన కోసం రూపొందించిన గృహ షెడ్యూల్ ప్రశ్నావళిని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం నోటిఫై చేసింది. తల్లిదండ్రుల వివరాలు, ఆధార్, మొబైల్ నంబర్, మొత్తం బ్యాంకు ఖాతాల సంఖ్య, పని ప్రదేశానికి ప్రయాణం, మతం, కులం వంటి 40 ప్రశ్నలు ఇందులో ఉన్నాయి. జనాభా గణన అనేది పరిపాలనకు ఒక కీలకమైన సాధనంగా నిలుస్తుంది. ఇది రాబోయే దశాబ్దానికి భారతదేశ అభివృద్ధి ప్రణాళికకు పునాది వేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే 80వ స్వాతంత్ర్య దినోత్సవాలను వీక్షించేందుకు ఢిల్లీ - ఎన్‌సిఆర్ ప్రాంతం నుండి `పిఎం విశ్వకర్మ` పథకం కింద 100 మంది లబ్ధిదారులను ప్రభుత్వం `ప్రత్యేక అతిథులు`గా ఆహ్వానించింది. ఈ లబ్ధిదారులు పిఎం విశ్వకర్మ పథకం కింద ఉన్న 18 సాంప్రదాయ వృత్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, వీరిలో దర్జీ, వడ్రంగి, కంసాలి, కమ్మరి, తాళాల తయారీదారుల వంటి వారు ఉన్నారని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (msme) మంత్రిత్వ శాఖ తెలియజేసింది. వీరికి గుర్తింపుగా జ్ఞాపికలను అందజేస్తారని, అనంతరం వారు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశమవుతారని పేర్కొంది. స్వాతంత్ర్య దినోత్సవాలలో పీఎం విశ్వకర్మ లబ్ధిదారుల భాగస్వామ్యం, భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వానికి సాంప్రదాయ కళాకారులు, చేతివృత్తుల వారు అందించిన అమూల్యమైన సేవకు లభించిన గుర్తింపు అని మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరారీలో ఉన్న డ్రగ్ కింగ్‌పిన్ వీరేందర్ సింగ్ బసోయాను యూఏఈ నుంచి తిరిగి రప్పించడంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) విజయం సాధించిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. మాదకద్రవ్యాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న "జీరో టాలరెన్స్" విధానంలో ఇది ఒక కొత్త మైలురాయి అని సామాజిక మాధ్యమం పోస్టులో ఈరోజు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =